# మానలమ్మ మనసు

## మొదటి రంగం

[ఉదయం 6 గంటలకు జానకమ్మ పాటబాడుతూ పంపుదగ్గిర నీళ్లు పడుతూ ఉంటుంది ]

జాన పాట

విరల శ్రీకృష్ణ–విజయ సారధికృష్ణా!
మాయలో పడియున్న–మమ్మేలు కృష్ణా
ద్రౌపదిని బ్రోచినా–ద్వారకాపురి కిష్ణ
దయయుంచి మమ్మేలు–దీనజన కృష్ణా!
దురభిమానము చేత–దూర మైతిమి కృష్ణ,
దురితంబులను బాపి–దరిజేర్చు కృష్ణా!

దుర్గమ్మ (ప్రవేశించి) ఏమండోయ్ మామ్మగారూ! కొస్త ఈ బిందెడు నీళ్లు పట్టుకోనిస్తారూ?

చేసుకోలేక అవస్థపడుతున్నావని, అన్నింటిలో నీళ్లు పడుతూవుంటే, పైగా ఎవరు పట్టమన్నారంటావా?

శాంత మొదలు ఆవిణ్ణి నీళ్లు పట్టకోనియ్యండి మీ కెందుకు మీరు పట్టుకు వెళ్లండి దుర్గమ్మగారూ, ఆవిడతో ఏమిటి?

దుర్గ ఇందాకటినుంచి బ్రతిమాలుతున్నా, పంపుదగ్గరకు రానివ్వలేదు చూశారా శాంతమ్మగారూ!

జాన ఇంకేం శాంతమ్మగారు పట్టకోమందిగా పట్టుకోండి [ఈసడింపుగా] మాలావ్ ఎలానైతేనేం దొరికింది శాంతమ్మ ఇరుగుపొరుగువా రందరికీ అలుసిచ్చి, నలుగురిలో నన్ను పురుగును విదలించినట్టు విదలిస్తావుషే ఔరా!

కాలా? చేతులు నొప్పిపుట్టేట్టు గట్టిగా పట్టుకుంటానుషే! (సాధింపుగా) మహాలావ్! నీవేకన్నావు పిల్లల్ని మేమేమైనా ఎరుగుదుమా? నేను పిల్లలను పెంచినదాన్ని గానుషే శాంతమ్మా?

శాంత చాల్లే ఇహ లోపలికి రండి

జాన వస్తాలే అంట్లు తోలచి

శాంత అబ్బ! అంట్లు నేను తోలుచుకుంటా లెండి

జాన నేను పిల్లలను మాత్రం ఎత్తుకోలేను బాబూ!

శాంత సరే మీ ఇష్టం, వచ్చినట్లు చేసుకోండి

[కొస్త నిశ్శబ్దం తర్వాత]

జాన పాట

గోపాలకృష్ణుడమ్మా! మాయమ్మ
గోవర్ధనోద్ధారుడమ్మా!
అపవాదు తొలగగానమ్మా! మాయమ్మ
ఆ భల్లూకమును గూల్చెనమ్మా!
జాంబవతిని పెండ్లాడెనమ్మా! మాయమ్మ
జాగుసేయక వేగమమ్మా!
శమంతకమణి ఇచ్చెనమ్మా! మాయమ్మ
సత్యభామను బడసె నమ్మా!

ఇదుగో అమ్మా! ఈ అన్నపుగిన్నె మసి సరిగ్గా వదల్లే లేదు మళ్లీ తోము ఈ కంచానికి జిడ్డేవదల్లేదు ఏమిషే నీ మొహం తోమటం

పనిమనిషి ఏంటి తల్లీ మళ్లా తోమమంటావు, ఇంత తెగా తోమినా?

జానక నేను తోమి చూపెంచుతా

## శ్రీ సింగరాజు లింగమూర్తి

జాన ఓ నిమిషం ఆగండి, నేను వెళ్లాక పట్టుకుందురు కాని

దుర్గ అయ్యో! పొయిమీద కూర మాడిపోతుంది మామ్మగారూ, కొస్త పట్టుకోనిద్దురూ

జాన పొయిమీద కూర పెట్టుకొని ఎట్లా వచ్చావమ్మా? కొస్త తాళు మరి, ఈ రెండు గిన్నెల్లో పట్టుకొని వెడతా తర్వాత మీరెన్ని బిందెల నీళ్లైనా పట్టుకోండి

దుర్గ కొస్త పట్టకోనియ్యండీ, మీకెంతైనా పుణ్యముంటుంది అదుగో పిల్లకూడా ఏడుస్తున్నది ఇంతింత చిన్న గిన్నెల్లోకూడా నీళ్లు పడుతూ కూర్చుంటే ఎట్లా?

జాన నేను ఎన్ని గిన్నెల్లో పట్టుకుంటే మీకేం? మీ సిరేమైనా ఎత్తుకుపోతున్నానా ఏమిషీ?

శాంత [లోపలినుంచి వస్తున్నట్లు గొంతు వినబడాలి ] ఇదేమిటం డత్తయ్యగారూ! [స్పష్టంగా వినబడాలి] నలుగురూ వాడుకొనే పంపుదగ్గర పేచీలు పెడుతూ కూర్చున్నారూ? అసలు మిమ్మల్ని నీళ్లెవరు పట్టమన్నారూ?

జాన [ఈసడింపుగా] ఆఁ వచ్చావూ తీర్చుకత్తెవు పోనీ పాపం, పిల్లలతో

శాంత లేకపోతే ఏమిటండీ! కూరలు వండుకునే గిన్నెల్లోనూ, పప్పుగిన్నెల్లోనూ నీళ్లు పట్టడం దేనికి? హాయిగా తిని కూర్చోక, ఎందుకొచ్చిందంట మీకీ లేనిపోని రభస? ఏం నేను నీళ్లు పట్టుకోలేనా? ఒంట్లో ఓపిక లేకపోయినా అన్నిటికీ తయారవుతారు లోపలికి రండి కొస్త చంటదాన్ని ఎత్తుకుందురుగాని

జాన ఆ చంటిదానికి నన్ను చూస్తేనే అసహ్యం కాసేపు కూడా దగ్గరుండదు

దుర్గ ఇక మీరు ఎన్ని నీళ్ళయినా పట్టుకోండి మామ్మగారూ, నేన వెళుతున్నా

జాన హుఁ! ముసలిదాన్ని చూస్తే అందరికీ ఎద్దేవాయే!

శాంత సరేలే. రండి చంటిదాన్ని ఎత్తుకుందురుగాని ఇంకా చాలా పని కావాలి

జాన అది నా దగ్గర ఉండదంటే, తీసుకోమంటా వేమిషే?

శాంత దగ్గర కూర్చొపెట్టుకొని ఆడిస్తే ఎందుకుండదూ? ఒళ్లో ఇరికించికొని, కదలనీయకుండా గట్టిగా పట్టుకుంటే లేత చేతులుకదా, నెప్పిపుట్టి ఏడ్వదుటండీ

జాన అయ్యో నా అమ్మ కడుపు


## నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది హ మేము, నిర్బలత్వ, నిస్సత్తువ శుక్ల నష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు 3-4-0 పోస్టేజి 12 అ

పి సి ఏ &కంపెని "ఆయుర్వేదసమాజం"

పెరిదేపి- నెల్లూరు జిల్లా

కాశ్మీర్

అన్నిదగ్గులకు అమోఘమైనది

గిరిజా & కో; రాజమండ్రి

సుండు . హూ వాళ్ళకి ఈ మనుషులు ఎక్కడ దొరుకుతారోగానీ, చేయి అన్చి, గిన్నెను తోమనే తోమరు ఒసేవ్ నీ అమ్మ కడుపుకాల, కొస్త నెమ్మదిగా తోలవ్వే గిన్నెల్ని. ఆ చిందులన్నీ నా మీదే పడుతున్నాయి

పనిమనిషి ఏంటమ్మా తిడుతున్నావ్? పెద్దదానివని మాట్లాడకుండా వుంటే

జానక ఆ సిభడవా! ఇంకా మాట్లాడుతున్నావా?

పనిమనిషి ఏంటమ్మోవ్ మళ్లీ తిడుతున్నావు తిడితే ఒరూరుకుంటారు

[శాంతమ్మ ప్రవేశం]

శాంత నీ కెందుకు నీవు ఊరుకో అత్యమ్మా ఆమెతో ఏమిటి

పనిమ సూడండి సిన్నమ్మగోరూ! నా అమ్మకడుపుకాలా అంటున్నది

జాన రోషం చాలానేవుంది అంత రోషం కలదానివి అంట్లు సరిగ్గా తోమరాదూ!

శాంత చాల్లే ఊర్కోండి, ఎవరైనా వింటే నవ్వుతారు సరిగ్గా తోమకపోతే నిదానంగా చెప్పి చేయించుకోవాలిగానీ తిడుతారుటండీ! తిరిగి వాళ్ళు మనల్ని తిడితే!

జాన ఆఁ మహాలావ్, నీతిమంతురాలివి బయలుదేరావు సిగ్గులేక పనిదాన్ని వెనకేసుకొస్తున్నావా?

[బూట్లచప్పుడు రాజయ్యప్రవేశం]

రాజయ్య ఏమిటమ్మా గొడవ?

జాన గొడవ కాకేముందీ నేను బ్రతికున్నంతవరకూ గొడవగానే వుంటుంది నేను అందరికీ అలాహమైపోయాను

శాంత ఏమి అనకుండా, ఎంత నోరు నొక్కుకున్నా, మీ అమ్మగారికి ఇట్టే కోపం వస్తుంది ఎవర్ని పడితే వాళ్ళను తీతిడితే ఊరుకుంటారుటం?

రాజ నీకెందుకమ్మా లేనిపోయిందంతా! హాయిగా కృష్ణా, రామా అనుకుంటూ కూర్చోక ఒకరిజోలి నీ కెందుకు?

జాన నే నెవరిజోలికి పోయాను, ఏట్లో వాళ్ళ జోలికి

రాజ పెద్దతనం వచ్చినకొద్దీ నీకు మతి చెడిపోతున్నదమ్మా!

జాన అవును నీవూ, నీ పెళ్లాం, పిల్లలూ మంచివాళ్ళు నేనే చెడ్డదాన్ని ఈ ముసలిది ఎప్పుడు విరగడైపోతుందా అని చూస్తున్నారు నాకెందుకు, నేను వెళ్ళి దుర్గమ్మగారింట్లో కూర్చుంటా

శాంత హాయిగా కూర్చోండి వద్దన్న దెవరు?

రాజయ్య సరే! ఇహ నే వెడతాను శాంతా! వేళైంది

శాంత మధ్యాహ్నం వచ్చేప్పుడు పళ్లేమైనా తెండి


రాజ సరేలే, [వెళ్లినట్లు బూట్లధ్వని]

## రెండవ రంగం

[ఆ రోజు మధ్యాహ్నం 12 గంటలకు]

జానకమ్మ నీ కేం తెగులొచ్చిందే నా మాట విప్పుతున్నావ్?

శాంతమ్మ ఏం లేదత్తయ్యగారూ, నా రిబ్బన్ [illegible] తే మీ మాటలో



ఉందేమోనని చూస్తున్నా

జానకమ్మ నీ రిబ్బను నా మాటలో కెందుకొస్తుందే సత్తెప్పాల ముఖమా? అయినా నన్ను అడిగితే యేడనూ, నీవు మాట విప్పటం దేనికి?

కాంతమ్మ మీరు అలిగి దుర్గమ్మగా రింట్లో కూర్చున్నారుగా అయినా, అడిగితే మీ రిస్తారా? ఇవిగో! నేను పెట్టుకునే తలపిన్నులు, పిల్లల గోచీగుడ్డలు, బలపాలూ, మేకులూ, కరక్కాయలు ఎందుకండీ, ఇవన్నీ మీ మాటలో? ఇవిగో! నా రిబ్బన్లు కూడా ఉన్నాయి

జానకమ్మ ఏమో, ఏ పిల్లలు పుక్కారో! ఇవన్నీ నే నేం చేసుకుంటా? ఇందుకోసమని నా మీద దొంగతనం కడ్తావా? ఇదుగో, చూశారా దుర్గమ్మగారూ! మా కోడలు నా మీద దొంగతనం వేస్తున్నది రామ రామ! కాస్త మీరైనా చెబుదురూ దీనికి బుద్ధి మరీ గడ్డితింటున్నది

కాంత మీరు దొంగతనం చేశారని నే నన్నానుటండీ? లేనిపోయింది ఏదో ఒక గోల పెడ్తారు

జాన. గోలా? నేను చేసిదంతా గోలానూ, నీవు చేసేదంతా మంచీనా? చూశారా దుర్గమ్మగారూ! నన్ను ఎట్లా ఆడిపోసుకొంటున్నదో? నేను ఒకరి జోలికి పోయేదాన్నా యేమన్నా? ఉత్త పుణ్యానికి నన్ను ఉడికించి తమాషా చూద్దామనుకుంటుంది

దుర్గమ్మ పోనీండి మామ్మగారూ! ఆమె ఏదో పొరపాటున అన్నదిలెండి [నవ్వు ఆపుకుంటూ] అయినా, అదేమిటండీ కాంతమ్మగారూ! పెద్దవారిని అలా అంటారా?

కాంత ఈవిడ పిచ్చిగానీ, లేకపోతే ఇవన్నీ ఈమూటలో ఎందుకు చెప్పండి! ఇదుగో చూశారా! పటిక బెల్లం పొట్లం ఇది తింటే తనకు పడదని తెలుసుకదా, వారినీ వీరినీ బ్రతిమాలి ఎందుకు తెప్పించుకోవాలి చెప్పండి

జాన నా కెవరు తెచ్చిపెడతారు? ఒక్క రాగిడబ్బు కూడా మీరు నా కివ్వరే?

కాంత ఎప్పుడైనా ఖర్మంచాలక ఇస్తే ఇదేగా వరస రహస్యంగా తెప్పించుకొని తినకపోతేనేం? ఈమెకు ఈ పటిక బెల్లంతింటే, ఒంటిమీద స్పృహ ఉండదు దుర్గమ్మగారూ? ఇంట్లో పిల్లలు డబ్బులు ఎక్కడైనా వదిలితే చాలు, గప్‌చిప్‌గా దాచేసుకుంటుంది మా పెద్దబ్బాయి భీముడికీ, ఈమెకీ ఏం భేదముంది చెప్పండి దుర్గమ్మగారూ! వాడూ ఇలాగే చేస్తుంటాడుగా

జాన అదుగో చూశారా! మళ్ళీ దొంగతనం అంటకడుతున్నది

దుర్గమ్మ ఆ ఏదో మిమ్మల్ని ఉడికిస్తానికి అంటున్నదిలెండి అయినా, ఆమెకేం ఖర్మం కాలిందండీ దొంగిలిస్తానికి? ఇహ పటిక బెల్లమంటారా, ఏదో కాస్త నోటిరోతకు తెప్పించుకుందేమోలెండి

జాన మా అమ్మ! మీరు మంచివారు కాబట్టి సరిపోయింది లేకపోతే విన్నవాళ్లు నిజంగానే ముసల్ది దొంగతనం చేసిందని అనుకోరుటండీ! నా తల్లి నీ మేలు మరచిపోను దుర్గమ్మతల్లీ నీవు నా కూతురితో సమానం!

దుర్గమ్మ అయ్యో ఇదేమిటి మామ్మగారూ, నన్ను కౌగలించుకుంటారేం?

కాంత అబ్బ! ప్రేమ పెలిగిపోతున్నది ప్రొద్దున పంపుదగ్గర ఈ ప్రేమ ఎక్కడికి పోయిందో?

జాన అమ్మ గడుగ్గాయీ!. నన్ను అంతలేసిమాట లంటావా? ఇవాళ్ల నీ ఇంట్లో అన్నంతింటే మట్టితిన్నట్టే జానకమ్మ అంటే పౌరుషంతో పుట్టిందనుకో

[రాజయ్య ప్రవేశించిన ధ్వని]

జాన ఒరేయ్ కుర్రాడా! నిన్నేరా! . ఇలా చూడూ నీ ఇంట్లో పచ్చిగంగ కూడా పుచ్చుకోను అమ్మా! అది నన్ను అంతలేసిమాట లంటుందా?

రాజ సరే! ఇది నీకు మామూలేగా! అన్నం మానుకుంటే సోమవచ్చి పడిపోతావు అన్నంతిని నీ ఇష్టం వచ్చినన్ని శాపనార్థాలు పెట్టు

జాన ప్రాణం పోయినాసరే, నేను అన్నం తినను నూరుసార్లు చెప్పినా, వెయ్యిసార్లు చెప్పినా, పెళ్లాన్ని వెనకేసుకు రావడమేగానీ, పెద్దదాన్ని తిట్టిపోస్తున్నది కదా, కాస్త బుద్ధిచెబుదామని నీ కుండ ద్దుట్రా రాజయ్యా! మరీ చవటవై పెళ్లానికి అడుగులకు మడుగులొత్తుతూ కూర్చుంటావా? అందుకే అన్నారు పెద్దలు, పెళ్లాం బెల్లం, తల్లి విషం అని హుఁ! అడ్డాలనాడే బిడ్డలుగానీ, గడ్డాలు వచ్చినతర్వాత బిడ్డలా, నా పిచ్చిగాని

కాంత ఇంటికివచ్చిన వ్యవధి లేదు, పోట్లాటకి తయారు పదండీ లోపలికి

రాజ ఇహ చాల్లే ఊరుకోవమ్మా! మరీ రెచ్చిపోతున్నావు నీ సంగతి ఎవరికి తెలియదూ, ఊ అంటే తప్పు ఆ అంటే తప్పు ఎట్లాగమ్మా నీతో ఇహ లేచిరా, భోజనం చేద్దాం

[కాస్త నిశ్శబ్దం]

కాంత (నవ్వుతూ) అదేమిటండీ అత్తయ్యగారూ! పట్టుబట్ట చేత్తో పట్టుకొని, మళ్ళీ వెనక్కు దాచుకుంటారేం, నన్ను చూసి హుఁ ఎంతబెట్టు మా భీముడూ ఇంతే దుర్గమ్మగారూ! వాడు అలిగాడంటే, సరదీయలేక మా పుటమారుతుంది

దుర్గ నాగురించైనా, మడికట్టుకుని భోజనం చేయండి మామ్మగారూ!

జాన నాతల్లి నీవు కాబట్టి ఆమాట అన్నావు మా కోడలు కొరివేనైనా అందేమో చూడు ఈ ముసల్ది తినకపోతే తన కేమనుకుంది


ప్రపంచ ప్రఖ్యాత మద్రాసు నశ్యం

★ ★

నాణ్యతయే దానిఘనత



ఒకసారి కొంటే తిరిగి వదలిపెట్టరు

★ ★

నశ్యములలో ఉత్తమమైనది పట్నం నశ్యమే కాని అత్యుత్తమమైనది, అందరూ కోరునది, కారం, నాణ్యత, సువాసన గలది అప్పాదురై నశ్యమే

అ. అప్పాదురై ముదలియార్ & సన్జ

౨౫, ఆచారప్పన్ వీథి, పోస్టుబాక్సు నెం 180, మద్రాసు-1

దుర్గ: ఆవిడతో లెక్కేమిటి మామ్మగారూ! మీ అబ్బాయిసొమ్ము మీరు తింటున్నారు, మధ్య ఆమె కేముందీ? క్షమించండి శాంతమ్మగారూ! ఊ లేవండి మామ్మగారూ!

జాన నీమాట వినకపోతే కళ్లు పోతాయి! మా అమ్మ బంగారుతల్లివి

## మూడవ రంగం

[ఆ రోజు సాయంత్రం]

జాన ఆయన చచ్చి ఎక్కడున్నారో గానీ, ధర్మరాజువంటివారు మీరు నమ్మ తారో నమ్మరో గాని దుర్గమ్మగారూ? ఆ మహారాజు పల్లెత్తుమాట అనేవారు కాదు అందుకే ఆయనను నెత్తిని పెట్టుకొని పూజించేదాన్ని.

దుర్గ• అలాగా మామ్మగారూ!

జాన మరేమిటనుకున్నావ్? ఒక రోజున ఏమైందనుకున్నావ్ మా ఇంటి పక్కన ఉండేవారబ్బాయి ప్రతిదినం మా పెరటిలోని తులసిమొక్కలన్నీ పీకి పారేస్తుండేవాడు అక్కడికీ చిన్నపిల్ల వాడుకదా అని ఓర్చుంటూనే వచ్చాను కానీ ఎన్నాళ్ళని సహిస్తాం చెప్పమ్మా!

దుర్గ నిజమే లెండి

జాన: ఒకరోజు ఆపిల్లవాని తండ్రి చూస్తూండగానే, గదమాయించాను ఆయన తమ తప్పని ఒప్పుకొంటాడనుకుంటే ఊహూ!, పైగా 'ఏమమ్మోయ్, పిల్లవాని కేం తెలుసమ్మా, అలా గదమాయిస్తావు' అన్నాడు చెప్పద్దూ, నాకు ఒళ్లుమండిపోయిందంటే నమ్మమ్మా? ఆపళంగా, గదమాయించడమే కాదు, చెంప పగలగొట్టా నన్నాను ఆ పెద్దమనిషి నన్ను 'నోరుమూసుకో' అన్నాడు నాకు అరికాలిమంట నెత్తికెక్కింది ఆ పెద్దమనిషిని ఫెళ్లున చెంప మీద బలంకొద్దీ కొట్టాను

దుర్గ ఆయన మీదే చేయి చేసుకున్నారా! ఎంత ధైర్యమండీ! ఆ పెద్దమనిషి ఊరుకున్నాడా మామ్మగారూ?

జాన ఊరుకోక ఉరిపెట్టుకుంటాడా? సిగ్గుతో తలవంచుకొని లోపలికి వెళ్లాడు

దుర్గ మీ వారు ఉండగానే కొట్టారా?

జాన ఆఁ నాకేమన్నా భయమా? అటువంటివాటికి ఆయనేం కలిగించుకొనేవారు కాదు ఒకవేళ కలిగించుకున్నా వద్దంటే ఊరుకుంటారు

దుర్గ నిజంగా ఆయన ధర్మరాజే మామ్మగారూ!

జాన• సరేకాని దుర్గమ్మగారూ, కాస్త బెల్లంముక్క పెట్టమ్మా! ప్రొద్దుటి నుంచీ మనసు ఊరికే పీకుతున్నది తినాలని మధ్యాహ్నం ఆ పటికిబెల్లం పొట్లం కాస్తా మా కోడలు తీసి ఎక్కడో దాచి పెట్టేసిందికదా

దుర్గ: అయ్యో! ఇంట్లో నిండుకుంది మామ్మగారు! లేకపోతే ఏం భాగ్యం, కాస్త ముక్క ఇచ్చేదాన్నే

జాన పోనీ, కాస్త చక్కెరన్నా పెట్టమ్మా! నోరు అసహ్యంగా ఉంది

దుర్గ అది కూడా అయిపోయిందండీ ప్రొద్దుట కాఫీలోకి లేక మీ కోడల్నే బదులడిగా

జాన సరే అయితే వస్తా మీ వారు వచ్చేవేళ్ళ అయినట్టుంది

దుర్గ ఆఁ

## నాల్గవ రంగం

[ఆ రోజు రాత్రి 12 గంటలకు]

జాన ఉష్! అబ్బ! ఈ దిక్కుమాలిన తేలు నా ప్రాణానికి ఎక్కడ దాపురించింది భగవంతుడా?

[కాస్త నిశ్శబ్దం తర్వాత]

అమ్మ బాబోయ్! తేలు కాటేసిందర్రోయ్! [బాధతో ఏడుస్తుంది]

రాజ [ఆవులించి] ఏమిటమ్మా! ఎక్కడ కుట్టింది తేలు?

జాన [బాధపడుతూ] దొడ్లోకి వెడితే అక్కడ ఈ రెండు చేతివ్రేళ్ళకీ కుట్టిందిరా తండ్రీ!

శాంత చేతివ్రేళ్ళకి ఎట్లా కుట్టింది అత్తయ్యగారూ?

జాన ఎలా కుట్టిందేమిటి నీ తలకాయ ప్రశ్న? [బాధపడుతూ] మొదలేమైనా మందు వేయరా బాబూ! అబ్బ అమ్మ • చచ్చిపోతున్నారా తండ్రీ!

రాజ ఉండు పెట్టెలో ఒక కుప్పె ఉండాలి చూస్తాను

[కొంత నిశ్శబ్దం]

రాజ వంటఇంటి తలుపు వేయలేదుటే శాంతా?

జాన వేయకపోవడమేమిటండీ? . నేను పడుకొనేటప్పుడు ఒకసారికి రెండుసారు చూసి మరీ పడుకున్నా. [లోపలికి వెళ్లినట్లు ధ్వని]

రాజ మరి తలుపెవరు తీశారంటావు?

జాన ఏమో? [రహస్యంగా] ప్రొద్దుటి నుంచీ బెల్లంముక్క పెట్టమని మీ అమ్మ దుర్గమ్మగారిని వేధించిందట పాపం! ఒకవేళ ఉండబట్టలేక, అంతా పడుకున్నారుకదా అని, బెల్లంముక్కకోసం వంటింట్లోకివచ్చి తిరగమోతలుడబ్బాల పెట్టె సొరుగులో చేయిపెట్టిందేమో, అక్కడే తేలుకుట్టిందనుకుంటా! దొంగతనం బైటపడుతుందని ఇవతలికి వచ్చి కేకలుపెట్టింది

రాజ అంతే అయిఉంటుంది

జాన ఏమర్రోయ్! నా మొరేమైనా ఆలకిస్తారా లేదా? అబ్బ! ఇస్! . అబ్బ! మీ మాటలు తర్వాత మాట్లాడుకోవచ్చులే, మొదలు మందు తేరాకూడ్రాదా!

రాజ పెట్లో మందు కనబడలేదమ్మా!

శాంత చేసుకున్నందుకు అనుభవించండి! ఆ వంటింట్లోకి పోకపోతే తేలు కుట్టేది కాదుగా

జాన • ఏదో నోటిరోతకోసం ఉండలేక వెళ్లానేమో, అక్కడే కుట్టింది శాంతమ్మ తల్లీ!

రాజ ఆమె అసలే బాధపడుతూంటే, మధ్య నీ దెప్పిపొడుపులేమిటే [నవ్వుతూ] నా చిన్నప్పుడు మధ్యాహ్నం పూట నీవు పడుకొనివుంటే, నేను వంటింట్లోకి సెనగపప్పుకోసం వెళ్లానని కొట్టావు కాదమ్మా! ఇప్పుడే వస్తానమ్మా! అవతలి వీధిలోని సోమసుందరాన్ని పిలుచుకొనివస్తా ఒక్క మంత్రం వేశాడంటే ఇట్టే తగ్గిపోతుంది!

శాంత తొందరగా రండి

జానకి చెప్పులు వేసుకొని వెళ్లరాదు కూడ్రాదా!

★


# బిడ్డల అజీర్ణమా?

**GRIPELIX** త్రుటిలో వారికడుపు నొప్పి, వాంతి భేగులు, ఉబ్బరము జ్వరము, దగ్గు ఈడ్పులు మొదలగు వాని నెల్ల హరించి, వారికి హాయి, మీకు ఆనందము గూర్చును



గ్రైపెలిక్స్

ఏమరకండి ఈదివ్యా మృతము, బిడ్డల ఆరోగ్యము కాపాడుచు, బలవంతుల గావించుటలో శ్రేష్ఠమైనది

*Mfrs* Synthetic Medical Products
Madras 10 — Ongole
*Stockists* Standard Drug & Chemicals
131, Nainiappa Naik St, Madras